

పెరుగుతున్న ఉధృతి
జూరాల జలాశయానికి వరద ఉధృతి పెరుగుతుండటంతో దిగువకు వదులుతున్నారు.
వివరాలు 8లో ▸



రాధాకృష్ణ పుష్పయాగం
నాగర్‌కర్నూల్‌లో సోమవారం రాధాకృష్ణ పుష్పయాగం వైభవంగా నిర్వహించారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /24.4

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



గోపాల్‌పేట: పంట రుణమాఫీకి సంబంధించి రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి బ్యాంకర్లకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఏపీజీవీబీ, ఎస్‌బీఐ మేనేజర్లతో ఆయన సమావేశమయ్యారు. ఏపీజీవీబీలో ఇప్పటి వరకు 2,665 మంది రైతులకు సంబంధించి రూ.14.98 కోట్లు, ఎస్‌బీఐలో రూ.12.98 కోట్లు మాఫీ అయ్యాయని బ్యాంకు మేనేజర్లు వివరించారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. త్వరలోనే రూ.రెండు లక్షల్లోపు రుణాలు మాఫీ అవుతాయని వివరించారు. పలువురు రైతులు తమ సమస్యలను ఆయనకు తెలియజేశారు. ఆయన వెంట జిల్లెల్ల ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్‌రావు, నాగన్నగౌడ్, విజయవర్ధన్‌రెడ్డి, భాస్కర్, సహదేవుడు, కృపాకర్‌రెడ్డి ఉన్నారు.

పీజీ కళాశాల సందర్శన..

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని పీజీ కళాశాలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి సోమవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ డా. జి.భగవంతులో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గదుల కొరత, హాస్టల్ భవన నిర్మాణం, ల్యాబ్‌ల వసతులు, రహదారి సమస్యలపై ప్రిన్సిపాల్ వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యాపకులు డా. బాలేశ్వర్‌రెడ్డి, డా. ఎస్.భగవంత్‌రెడ్డి, డా. చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, కురుమూర్తి యాదవ్, హరిత, నిరంజన్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష విధానం రద్దు చేయాలి

పెబ్బేరు రూరల్: ఆశా కార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్ష విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆశా కార్యకర్తలతో కలిసి జిల్లాకేంద్రంలోని మర్రికుంట నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషికం పెంచాలని.. రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం 23 డిమాండ్ల వినతిపత్రాన్ని కలెక్టర్ ఏఓకు అందజేశారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు నిక్సన్, ఆశాల సంఘం జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ, సునీత, అనసూయమ్మ, భాగ్య, గిరిజ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో వర్గపోరు!

ప్రజాక్షేత్రంలో గెలిచామంటూ ఓ వర్గం.. కేబినెట్ హోదా అంటూ మరో వర్గం...



- ప్రొటోకాల్ విషయంలో తరచూ ఇబ్బందులు
- బహిరంగంగానే విమర్శించుకుంటున్న అధికారపక్ష నేతలు
- ఎవరంతకు వారు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న వైనం
- 20 రోజుల వ్యవధిలో రెండు వివాదాస్పద ఘటనలు
- నలిగిపోతున్న అధికారులు

వనపర్తి: నియోజకవర్గంలో కాంగ్రెస్ వర్గపోరు తారాస్థాయికి చేరింది. ప్రొటోకాల్ విషయంలో రెండు వర్గాల్లో తరుచూ మనస్పర్థలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజాక్షేత్రంలో గెలిచాం.. మేమే కీలకమని ఒక వర్గం, మా నాయకుడిది కేబినేట్ హోదా అంటూ మరో వర్గం అటు నాయకుల్లో, ఇటు అధికారుల్లో విస్మయం కలిగించేలా వ్యవహరిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రధాన నేతలను పక్కనబెట్టి ఇరు వర్గాల శ్రేణులు బహిరంగంగా విలేకర్ల సమావేశాలు నిర్వహించి విమర్శలు గుప్పించుకోవటం శోచనీయం. ఇప్పటికే ప్రారంభోత్సవాలు, అధికారిక కార్యక్రమాల్లో పలుమార్లు వర్గపోరు స్పష్టంగా వ్యక్తమైనా.. పార్టీపెద్దలుగాని, పాలకపెద్దలుగాని జోక్యం చేసుకోకపోవడంతో నియోజకవర్గ సమస్య జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది. చిలికి చిలికి గాలివానలా మారి పార్టీకి నష్టం కలిగేలోపే పెద్దలు జోక్యం చేసుకుంటే బాగుంటుందని అధికార పక్షం నాయకులు చర్చించుకుంటున్నారు.

ఆందోళనలో అధికారులు..

ఒకరిది కేబినేట్ హోదా.. మరొకరిది లెజిస్లేటివ్ పవర్.. ఎవరిని కాదన్నా సమస్యలు ఎదురవుతాయనే ఆందోళన స్థానిక అధికారుల్లో తీవ్రతరమవుతోంది. వారి పరిస్థితి ముందుకెళ్తే నుయ్యి.. వెనక్కి వెళ్తే గొయ్యి అన్న చందంగా మారింది. ఇటీవలే గోపాల్‌పేట, పెద్దమందడి మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఇద్దరూ కలిసి పంపిణీ చేశారు. ఒకేవేదికపై కూర్చొని కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎప్పుడు ఎక్కడ తేడాలొస్తాయనే భయంతోనే అధికారులు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. కర్నెతండాలో ఎమ్మెల్యే లేకుండానే పీహెచ్‌సీ ప్రారంభించడంతో బస్సు ప్రారంభోత్సవాన్ని ఎమ్మెల్యే వర్గం సీరియస్‌గా తీసుకొని ఆర్టీసీ అధికారులతో నిక్కచ్చిగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అధికార పక్షంలోని రెండువర్గాల కేడర్‌లోనూ మనస్పర్థలు తారాస్థాయికి చేరుకున్నట్లు సమాచారం. అధిష్టానం జోక్యం చేసుకుని సయోధ్య కుదర్చకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మేలు చేసినట్లు అవుతుంది. ఇప్పటికే.. మున్సిపల్ పీఠాన్ని ఈ రెండువర్గాల మధ్య తామే ఎగరేసుకుపోవాలని బీజేపీ వ్యూహరచన చేస్తోందని సమాచారం. వర్గపోరు అస్త్రాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకుని మున్సిపల్ పీఠం చేజిక్కించుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది.

20 రోజుల్లో రెండు ఘటనలు..

ఈ నెల 3న ఖిల్లాఘనపురం మండలం కర్నెతండా పీహెచ్‌సీని ఎమ్మెల్యే లేకుండానే కేబినేట్ హోదాలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి ఎంపీపీతో కలిసి ప్రారంభించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఉన్నతాధికారులు ప్రారంభోత్సవాన్ని వాయిదా వేయాలని మౌఖిక ఆదేశాలిచ్చినా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సమాచారం ఇచ్చామని.. ఎంపీపీ అనుచరుడితో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఆహ్వాన పత్రాన్ని పంపించామని బదులిచ్చారు. ఈ విషయంపై ఇరువర్గాల మధ్య కొన్నాళ్లు మాటల యుద్ధం కొనసాగింది. ఈ ఘటనను మరవకముందే జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాల నుంచి గోపాల్‌పేట వరకు ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించాలంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఆర్టీసీ అధికారులతో చర్చించి సోమవారం ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యారు. ఉదయం 8.30 గంటలకు బస్సును ప్రారంభించేందుకు నిర్దేశించిన ప్రదేశానికి వెళ్లిన చిన్నారెడ్డికి అధికారులు చెయ్యిచ్చారు. ప్రొటోకాల్ పాటించకుండా స్థానిక ఎమ్మెల్యేను కాదని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అసెంబ్లీలో చర్చించి హక్కులను కాలరాస్తున్నందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ చేయక తప్పదని ఎమ్మెల్యే వర్గం హెచ్చరించడంతో ఆర్టీసీ అధికారులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

ప్రారంభం కాని బస్సు..

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వైద్య కళాశాలకు రాకపోకలు సాగించేందుకు ఓ షటిల్ బస్సును ప్రారంభించాలని మూడురోజుల క్రితం డీఎం వేణుగోపాల్‌కు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి సూచించారు. దీంతో అధికారులు సోమవారం ప్రారంభించేందుకు నిర్ణయించి ఆయనకు సమాచారం ఇచ్చారు. తనకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభించొద్దని.. ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫోన్‌లో డిపో అధికారులకు తెలిపారు. ఈ క్రమంలోనే వారు ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించగా.. తనకు సమయం ఉన్నప్పుడు వస్తానని ఎమ్మెల్యే బదులిచ్చారు. ఈ విషయాలేవీ తెలియని చిన్నారెడ్డి అధికారులు సూచించినట్లుగా తన అనుచరులతో కలిసి మెడికల్ కళాశాలకు చేరుకున్నారు. సుమారు రెండు గంటల తర్వాత డిపో మేనేజర్, ఇతర అధికారులు అక్కడికి చేరుకొని బస్సు ప్రారంభించవద్దని.. తమపై ఒత్తిడి ఉందని అందుకే బస్సు తేలేదని ఆయనకు వివరించారు. తమ వల్ల ప్రయాణికులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దని.. తాను దూరంగా ఉంటానని.. అధికారులు ప్రారంభించాలని సూచించారు. దీంతో అధికారులు మౌనం వహించగా మీరైనా ఏం చేస్తారంటూ చిన్నారెడ్డి అక్కడి నుంచి ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్సు ప్రారంభించేందుకు కలిగిన అసౌకర్యాలను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోన్‌లో ప్రయత్నించారు.

నిర్మలమ్మ.. కరుణించేనా

కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి



- గద్వాల–మాచర్ల లైన్‌కు అడుగులు పడేనా?
- పాలమూరు ఎత్తిపోతలకు ప్రత్యేక గుర్తింపు వచ్చేనా?
- ఉమ్మడి పాలమూరు జిల్లా కేటాయింపులపై భారీ ఆశలు

సాక్షి, నాగర్‌కర్నూల్: పార్లమెంట్‌లో నేడు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. మంగళవారం బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు లభించే కేటాయింపులపై ఆసక్తి నెలకొంది. ఏళ్లుగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదాతో పాటు ప్రాజెక్టులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన కొత్త రైల్వేలైన్ల నిర్మాణానికి ఈ సారి సమావేశాల్లోనైనా అడుగు ముందుకు పడుతుందా అన్న ఆశలు నెలకొన్నాయి. వెనుకబడిన జిల్లాగా పేరొందిన పాలమూరులో రైల్వేలైన్ల నిర్మాణం, నూతన పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి చెందనుంది. ఈ మేరకు బడ్జెట్‌లో ఎంతవరకు కేటాయింపులు ఉంటాయన్నది నేటి బడ్జెట్ సమావేశాల్లో తేలనుంది.

'పాలమూరు' ప్రాజెక్టుకు సాయం అందేనా?

ఉమ్మడి పాలమూరు జిల్లాలో చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి కేంద్రం నుంచి నిధులు అందజేయాలన్న డిమాండ్ ఉంది. రూ.52 వేల కోట్ల అంచనాలతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తే త్వరితగతిన పూర్తి కానుంది. ఈసారి బడ్జెట్‌లో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర సాయం అందుతుందన్న అంచనాలున్నాయి. పాలమూరు వంటి వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్న డిమాండ్ ఉంది. ఈసారి బడ్జెట్‌లో కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇచ్చే సాయాన్ని పెంచడం ద్వారా రైతులకు మరింత లబ్ధిచేకూరుతుందని భావిస్తున్నారు.

సర్వేలకే పరిమితమైన లేన్లు

ఈ సారి బడ్జెట్‌లో కృష్ణా–వికారాబాద్, గద్వాల–డోర్నకల్ నూతన లేన్లపై నిధుల కేటాయించి పూర్తిచేస్తారన్న అంచనాలు నెలకొన్నాయి. 1988లో నారాయణపేట జిల్లా కృష్ణా నుంచి వికారాబాద్ 87 కిలోమీటర్ల మేర రూ.90 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇప్పటివరకు ఈ లేన్ కోసం ఐదుసార్లు సర్వే చేశారు. ఈ రైల్వే ప్రాజెక్టు కోసం ఫైనల్ లొకేషన్ (ఎఫ్‌ఎల్‌ఎస్)ను రైల్వే బోర్డు సైతం ఆమోదించింది. ఈ లేన్ పరిధిలో 316 కిలోమీటర్ల వరకు సర్వే చేసి పూర్తి చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన నిధులు మంజూరు అవుతాయని ఈ ప్రాంతవాసులు ఆశిస్తున్నారు. గద్వాల–డోర్నకల్ (220 కిలోమీటర్లు) లేన్‌కు 1992లో రూ.190 కోట్లతో ప్రతిపాదించినా ఇప్పటికీ మోక్షం లేదు. ఇప్పటికే మూడుసార్లు సర్వే పూర్తయిన గద్వాల–మాచర్ల లైన్ నిర్మాణానికి ఈ బడ్జెట్‌లోనైనా అడుగులు ముందుకు పడాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

పెండింగ్ పనులకు మోక్షం దక్కేనా..?

ఉమ్మడి జిల్లాలో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం కోసం ఏళ్ల కిందట చేసిన ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అచ్చంపేట–మహబూబ్‌నగర్–తాండూర్ 180 కిలోమీటర్ల కొత్త రైల్వేలైను కోసం రూ.360 కోట్లతో నిర్మించేందుకు గతంలోనే కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే ఇందుకు సంబంధించి నిధులు కేటాయించకపోవడంతో ప్రతిపాదనలకే పరిమితమైంది. 2007లోనే రూ.340 కోట్లతో ప్రతిపాదించిన జడ్చర్ల–నాగర్‌కర్నూల్–కొల్లాపూర్–నంద్యాల వరకు 170 కిలోమీటర్ల రైలు మార్గం సైతం పెండింగ్‌లోనే ఉంది.

వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెరగాలి..



అత్యధిక జనాభా ఆధారపడుతున్న వ్యవసాయ రంగంపై బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెరగాలి. తద్వారా మెజార్టీ ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. కొత్త రాష్ట్రమైన తెలంగాణకు, వెనుకబడిన జిల్లా పాలమూరుకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత దక్కాలి. కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఆదాయ పన్ను చెల్లింపులో స్లాబ్ పెంచడం ద్వారా ఉద్యోగస్తులకు మేలు జరుగుతుంది. సామాన్యులకు మేలు జరిగేలా కేంద్ర బడ్జెట్ ఉంటుందని ఆశిస్తున్నాం.

– డాక్టర్ గడ్డం జిమ్మి కార్టస్, హెచ్‌ఓడీ, ఎకనామిక్స్, పాలమూరు యూనివర్సిటీ

చదువుతోనే సమాజంలో గుర్తింపు



పాన్‌గల్‌లో లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి బోధన
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని.. ప్రతి ఒక్కరూ విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ పిల్లలను బాగా చదివించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో పీఎంశ్రీ నిధులు రూ.85.50 లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదులు, విజ్ఞానశాస్త్ర ప్రయోగశాలకు మంత్రి శంకుస్థాపన చేసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి బోధన సాగుతోందని.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. సమయాన్ని వృథా చేయరాదని.. దినపత్రికలు చదువుతూ జ్ఞానాన్ని పెంచుకోవాలని, ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలన్నారు. తనకు వచ్చే రూ.10 కోట్లతో రూ.2 కోట్లు తాగునీటికి, మిగతా రూ.8 కోట్లను విద్యకు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎస్‌ఓ కోరగా.. రూ.25 లక్షలు అదనంగా కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అదనపు గదులు, విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల నిర్మాణం నాణ్యతగా, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

దళారులను ఆశ్రయించొద్దు..

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తుల విషయంలో లబ్ధిదారులు ఎట్టి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించొద్దని మంత్రి జూపల్లి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో పాల్గొని 57 మంది లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలను గౌరవించాలని.. ఇచ్చిన దరఖాస్తు స్వీకరించి ఎన్ని రోజుల్లో పరిష్కారం అవుతుందనే విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రజలను అవమానించడం, ఇబ్బందులకు గురిచేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వానికి.. ప్రస్తుత ప్రజాపాలన ప్రభుత్వానికి మార్పు ఉండేలా మంచి పాలన అందించాలనే సీఎం లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు, తహసీల్దార్ సుభాష్‌నాయుడు, కస్తూర్బా విద్యాలయ ఎస్‌ఓ హేమలత, డీటీ అశోక్‌నాయుడు, ఆర్‌ఐలు మహేష్, తిరుపతయ్య, విండో డైరెక్టర్ ఉస్మాన్, నాయకులు వెంకటేష్‌నాయుడు, రవికుమార్, రాముయాదవ్, హైమావతి, బ్రహ్మయ్య, మధుసూదన్‌రెడ్డి, పుల్లారావు, భాస్కర్‌యాదవ్, బాలరాజుయాదవ్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలు సత్వరం పరిష్కరించాలి

ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



ప్రజావాణిలో అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ సంచిత్ గంగ్వార్, చిత్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరై వినతులు స్వీకరించి అర్జీదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు 48 అర్జీలు రాగా.. పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు సిఫారస్ చేశారు. వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా భూ ఫిర్యాదులే ఉన్నాయి. ప్రజావాణి అనంతరం జిల్లాస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. వన మహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యం మేర మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయించాలని ఆదేశించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పని హెచ్చరించారు.


హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి..

సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. కలెక్టర్‌తో కలిసి కాసేపు కూర్చొని అర్జీదారుల సమస్యలు విన్నారు. అర్జీలను సాధ్యమైన త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు.

నాణ్యత ధ్రువీకరణ పత్రాలివ్వండి..

అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ఆయా బడుల్లో చేపట్టిన మరమ్మతులు నాణ్యతగా చేసినట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం విద్యాశాఖ, పీఆర్ ఇంజినీర్లతో వెబెక్స్‌లో సమావేశమై పనులపై సమీక్షించారు. జిల్లాలో మొత్తం 219 పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టగా.. ఇప్పటి వరకు 39 పాఠశాలల్లో పనులు పూర్తి కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల వారీగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయిన పాఠశాలల్లో నాణ్యత ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని.. వాటిపై మండల విద్యాశాఖ అధికారి, స్కూల్ హెచ్‌ఎంలు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ల సంతకం ఉండాలని సూచించారు. అలాగే పనుల ప్రారంభానికి ముందు.. తర్వాత ఫొటోలు ధ్రువీకరణ పత్రాలకు జత చేయాలని, అప్పుడే బిల్లుల చెల్లింపులకు ఆమోదం ఇస్తామన్నారు.

పోలీసు ప్రజావాణికి ఏడు వినతులు..



జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏడు వినతులు దాఖలైనట్లు ఏఎస్పీ రాందాస్ తేజావత్ తెలిపారు. అందులో 3 భూ సమస్యల పరిష్కారానికి, 3 పరస్పర గొడవలకు సంబంధించిన అర్జీలు కాగా.. ఒకటి భార్యాభర్తల గొడవకు సంబంధించిన అర్జీ దాఖలైంది. ఆయా అర్జీలను సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు సిఫారస్ చేసినట్లు ఏఎస్పీ వెల్లడించారు.


పరిహారం చెల్లింపులో జాప్యమెందుకు?

వనపర్తి: జలాశయాలు, కాల్వల నిర్మాణాలకు భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యమెందుకు అవుతుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రశ్నించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని నీటిపారుదలశాఖ ఈఈ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏదుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లింక్ కెనాల్, బుద్ధారం కుడి, ఎడమ కాల్వలు, ఖాన్ చెరువు, కాశీంనగర్ కాల్వ నిర్మాణంతో పాటు పలు వంతెనలు, రహదారులు, పైప్‌లైన్ నిర్మాణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు సాగునీరు అందించడం ముఖ్యమని అధికారులు భావించాలన్నారు. నిబంధనల ప్రకారం.. భూములిచ్చిన వారికి సకాలంలో పరిహారం చెల్లించేందుకు కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మినీ లిఫ్టులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇరిగేషన్ ఈఈ మధుసూదన్, డీఈఈ వెంకటరమణమ్మ, గఫార్, ఏఈలు కమల్ హాసన్, భరత్, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి..

నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. సోమవారం స్థానిక విద్యుత్ ఏఈ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ పి.మహేష్, నాయకులు సత్యశీలారెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉధృతి



జూరాల ప్రాజెక్టు 37 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- జూరాలకు 1.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 37 క్రస్టు గేట్ల ఎత్తివేత.. దిగువకు 1.78 లక్షల క్యూసెక్కులు విడుదల

ధరూర్/ మదనాపురం/ దోమలపెంట/ ఆత్మకూర్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. సోమవారం ప్రాజెక్టుకు 1.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు వద్ద 37 క్రస్టు గేట్లను ఎత్తి 1,45,003 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్ల ద్వారా 29,307 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. ఆవిరి రూపంలో 42 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 584, ఎడమ కాల్వకు 640, నెట్టెంపాడుకు 1,500, భీమా లిఫ్టు-1కు 1,300, క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1,78,783 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.645 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 1,15,406 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 1.50 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 93.810 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే దిగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో.. 25 గేట్లను ఎత్తి 1,44,250 క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 27.887 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలానికి భారీ వరద

శ్రీశైలం జలాశయానికి ఎగువనున్న జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా సోమవారం 1,74,717 క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరుతుంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 832.5 అడుగుల వద్ద 52.1476 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో స్థానికంగా 14.0 మి.మీ., వర్షపాతం నమోదైంది. అలాగే శ్రీశైలం జలాశయంలో నుంచి 61 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాదులో 1,020 అడుగులు

రామన్‌పాదు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 870 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల వరద వస్తుంది. దీంతో జలాశయంలోని వివిధ లిఫ్టుల ద్వారా 1,151 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రసీల్‌రెడ్డి తెలిపారు.

ముమ్మరంగా విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం ఎగువలోని 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలోని 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 29.539 మి.యూ., యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు. జూరాలకు భారీగా వరద వస్తుండటంతో విద్యుదుత్పత్తి కోసం 39 వేల క్యూసెక్కులు వినియోగించి దిగువన శ్రీశైలానికి వదులుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఈలు పవన్ కుమార్, రాజు, రూపేష్, ఈఈ దర్బార్‌వలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైనాన్స్ వ్యాపారి అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

- 1,500 మందితో రూ.50 కోట్లు పెట్టుబడి పెట్టించి మోసం చేసిన సాయిబాబా
- ప్రధాన నిందితుడితో పాటు మరో నలుగురు అరెస్ట్

నాగర్‌కర్నూల్ క్రైం: అత్యధిక వడ్డీకి ఆశపడి కష్టపడి సంపాదించుకున్న నగదును ప్రైవేటు చిట్‌ఫండ్‌లో, ప్రైవేటు ఫైనాన్స్‌లో పెట్టి బాధితులు మోసపోవద్దని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలియజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓం సాయి శ్రీరాం ఫైనాన్స్‌లో అత్యధిక వడ్డీ ఆశ చూపి బాధితులను మోసం చేసిన ఫైనాన్స్ వ్యాపారి సాయిబాబాతో పాటు మరికొందరిని అరెస్టు చేసి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారీ సాయిబాబ 1995 సంవత్సరం నుంచి జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 2014 నుంచి 2020 సంవత్సరం వరకు పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారి నుంచి వచ్చిన నగదును సాయిబాబ తన ప్రైవేటు ఫైనాన్స్‌లో అధిక వడ్డీకి ఆశచూపి పెట్టుబడి పెట్టించాడు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన 1,500 మంది బాధితుల నుంచి దాదాపుగా రూ.50 కోట్లు ప్రైవేటు ఫైనాన్స్‌లో పెట్టుబడి పెట్టించి నగదును తిరిగి ఇవ్వలేదు. మోసపోయిన బాధితులు అందరూ వనపర్తి, నాగర్‌కర్నూల్ పోలీసులను సంప్రదించడంతో కేసు నమోదు చేసుకుని స్పెషల్ టీంను ఏర్పాటు చేసి నిందితులను సోమవారం పట్టుకున్నట్లు తెలియజేశారు. ఓం సాయి శ్రీరాం ఫైనాన్స్ యజమాని ఇటిక్యాల సాయిబాబతో పాటు, అతడి కుమారుడు ఇటిక్యాల సాయిదీక్షిత్, తాడూరుకు చెందిన శ్రీనివాసులు, వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వీరిపై జిల్లాలో 9 చీటింగ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. సాయిబాబ బాధితుల నుంచి దోచుకున్న రూ.50 కోట్లను కుటుంబసభ్యుల పేరిట భూములు కొనుగోలు చేశాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాడు. ఇతరులకు ఎక్కువ మొత్తంలో వడ్డీకి ఇచ్చినట్లు విచారణలో తెలిసిందన్నారు. కేసును మరింత లోతుగా విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. విచారణలో 50 ఎకరాల భూమి, హైదరాబాద్‌లో ఒక అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించినట్లు తెలియజేశారు. బాధితులందరికీ కోర్టు ద్వారా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య గౌడ్, ఎస్‌ఐ గోవర్ధన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



నర్సింహులు(ఫైల్)

కేటీదొడ్డి: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం కేటీదొడ్డి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండాపురానికి చెందిన వడ్డే నర్సింహులు(21) సోమవారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద ట్రాక్టర్‌తో దున్నిస్తూ.. పనిలో నిమగ్నమయ్యాడు. కాల్వలో మోటార్ వేయడానికి వెళ్తుండగా.. విద్యుత్ స్తంభంపై ఉన్న వైర్ స్తంభానికి తాకడంతో ఎర్త్ అయింది. ప్రమాదవశాత్తు వడ్డె నర్సింహులు కరెంట్ స్తంభాన్ని తాకడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్ట్‌మార్టంకు తరలించారు. తండ్రి గోవిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

వెల్డింగ్ చేస్తూ జారిపడి వ్యక్తి..

మాగనూర్: మండలంలోని వడ్వాట్ గ్రామ పంచాయతీ యామన్‌దొడ్డి గ్రామ శివారులో బసవేశ్వర జిన్నింగ్, ప్రెసింగ్ పత్తి మిల్లులో వెల్డింగ్ చేస్తూ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మాగనూర్ ఎస్‌ఐ అబ్దుల్‌ఖాదర్ వివరాల ప్రకారం.. గత మార్చి 23న విద్యుదాఘాతంతో పత్తిమిల్లు కాలిపోయింది. అయితే పునఃప్రారంభం చేసేందుకు యజమాని పత్తి మిల్లుకు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి వెల్డింగ్ వర్కర్స్‌ను తీసుకొచ్చి కొన్ని రోజులుగా పనులు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశత్తు పైనుంచి ఎండీ పాష(40) జారిపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మక్తల్ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో బాలిక..

చారకొండ: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికను పాముకాటు వేయడంతో మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని తుర్కలపల్లికి చెందిన ఏదుల సువర్ణ, యాదయ్య దంపతుల పెద్ద కూతురు రేణుక(4) సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటుంది. ఈ క్రమంలో అకస్మాత్తుగా వచ్చిన పాము బాలిక కాలుకు కాటువేసింది. దీంతో బాలిక తల్లిదండ్రుల వద్దకు ఏడుస్తూ రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వారు పేర్కొన్నారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు



ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగిన ఘటన మండలంలోని ఆగారంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆగారం చెందిన దంతపులు కుర్వ మల్లయ్య, శివలీల కొత్తగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ తెచ్చుకున్నారు. సిలిండర్‌కు రెగ్యులేటర్ సరిగా బిగించకుండానే అగ్గిపుల్లను భార్య శివలీల వెలిగించింది. గ్యాస్ లీక్ కావడంతో మంటల చెలరేగాయి. ఒక్క సారిగి మంటలు పెరగడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. ఇంట్లోకి వెళ్లడానికి గ్రామస్తులు ఎవరూ సాహసించలేదు. విషయాన్ని పోలీసులకు చెప్పడంతో ఏఎస్‌ఐ సత్యంగౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు ధైర్యం చెప్పడంతో పాటుగా ఇంట్లోకి వెళ్లి మంటలు ఆర్పేందుకు పెద్ద ఎత్తున నీటిని పోశారు. కొంత సేపటికి మంటలు పూర్తిగా ఆరిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

డీజీపీని కలిసిన మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి పూలబొకె అందజేశారు.

ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు



ఆర్‌అండ్ బీ సీఈకి స్వాగతం పలుకుతున్న ఈవో, అర్చకులు



రైల్వే ఎస్పీని ఆహ్వానిస్తున్న ఆలయ ఈఓ

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను సోమవారం ఉదయం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీయర్ రాజేంద్ర నాయక్, మహబూబ్‌నగర్ ఎస్‌ఈ కిరణ్‌కుమార్, డీఈ కిరణ్‌కుమార్, ఏఈ మహేష్ కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణ అధికారి పురేందర్‌కుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీయర్ దంపతులు బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వారికి ఆలయ స్థల పురాణాన్ని తెలియజేశారు. తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచన చేశారు. ఈఓ పురేందర్‌కుమార్ వారికి అమ్మవారి జ్ఞాపికను బహూకరించారు.

ఆలయాన్ని దర్శించుకున్న రైల్వే ఎస్పీ

అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు కర్నూలు రైల్వే ఎస్పీ చౌడేశ్వరీ దేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఉభయ ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

కలెక్టరేట్‌లో ఎస్టీఓ ఆకస్మిక మృతి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన కలెక్టర్ విజయేందిర



మోహన్‌రాజు కూతురు, కొడుకును ఓదార్చుతున్న కలెక్టర్ విజయేందిర బోయి



మోహన్‌రాజు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: అప్పటి వరకు తమతో కబుర్లు చెప్పుకొంటూ వచ్చిన తండ్రి.. అంతలోనే తిరిగి రాని లోకాలకు వెళ్లాడని తెలుసుకొని బోరున విలపించారు. తండ్రి లేకపోతే తాను బతకలేనంటూ కూతురు విలపించడంతో చుట్టుపక్కల వారు సైతం కన్నీటి పర్యంతమయ్యారు. డీటీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఎస్టీఓ ఆకస్మిక మృతితో విషాదం అలుముకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. వనపర్తికి చెందిన మోహన్‌రాజు(54) మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని డీటీఓ కార్యాలయంలో ఎస్టీఓగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కొడుకు హరిప్రసాద్, కూతురు సుప్రజలతో కలిసి మోహన్‌రాజు కారులో వనపర్తి నుంచి మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌కు చేరుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌కు బయలుదేరారు. అయితే మోహన్‌రాజు డీటీఓ కార్యాలయంలోకి వెళ్లే క్రమంలో ముందుగా పక్కన ఉన్న వాష్‌రూం వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత కార్యాలయం లోపలికి వెళ్లే సమయంలో కళ్లు తిరిగినట్లు కావడంతో కొద్దిసేపు మెట్ల దగ్గర నిలబడ్డాడు. కొంత సమయం తర్వాత చుట్టూ తిరిగి కిందపడిపోవడంతో తల బలంగా ఫ్లోర్‌కు తగిలి రక్తస్రావమైంది. గమనించిన ఇతర సిబ్బంది వెంటనే చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మోహన్‌రాజుకు భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు.

కలెక్టర్ పరామర్శ

అకస్మాత్తుగా మృతిచెందిన ఎస్టీఓ మోహన్‌రాజు మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రిలోని క్యాజువాలిటీ విభాగంలో కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. అనంతరం మోహన్‌రాజు కొడుకు హరిప్రసాద్, కూతురు సుప్రజలను పరామర్శించారు. కూతురు మా నాన్నకు ఏమైంది.. ఇంతమంది ఎందుకు వచ్చారు.. మా నాన్న లేకుంటే నేను బతకలేను అంటూ విలపించడం కలెక్టర్‌తోపాటు అక్కడ ఉన్న వారందరిని కలచివేసింది. ఈ సందర్భంగా కూతురికి కలెక్టర్ ధైర్యం చెప్పడంతోపాటు ఇద్దరు మహిళా ఆర్‌ఎంఓలను పక్కనే ఉండి చూసుకోవాలని సూచించారు. అలాగే మోహన్‌రాజు మృతదేహాన్ని డీడీ శ్రీనివాసులు, ఏటీఓలు ఈశ్వరప్ప, తానాజీ, సిబ్బంది పరిశీలించారు.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

అయిజ: జల్సాలకు అలవాటుపడి పలు దేవాలయాల్లోని హుండీలను ఎత్తుకెళ్లిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి రూ.3,275 నగదు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ విజయ భాస్కర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న రాత్రి అయిజ పట్టణానికి చెందిన బుడుగ జంగాల మారెప్ప, స్నేహితుడు బుడుగ జంగాల ఉరుకుంద మండలంలోని చిన్నతాండ్రపాడు శివారులోని సత్యమాంబ గుడిలో హుండీ ఎత్తుకొని వెళ్లారు. ఆదివారం పూజారి తంబలి కరుణాసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును ఛేదించి సోమవారం ఇద్దరిని రిమాండ్‌కు పంపారు. వీరే గత నెల 28న గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని చాగదొణలో రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో హుండీని కొల్లగొట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

1500 కిలోల నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్: మండలంలోని రంగాపూర్‌లోని ఇంట్లో నిల్వ ఉన్న నల్లబెల్లం బస్తాలను సోమవారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్ వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలోని పలు ఇళ్లలో తనిఖీ చేస్తుండగా, ఓ ఇంటిలో దాచిన 50 బస్తాలు(1500 కిలోలు) నల్లబెల్లం, వంద కిలోల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. నల్లబెల్లం నిల్వ ఉంచిన వ్యక్తిని త్వరలోనే గుర్తిస్తామన్నారు. నల్లబెల్లం అమ్మినా, సరఫరా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



చోరీ నిందితుల అరెస్ట్

- ఆలయాలు, ఇళ్లలో పలు చోరీలు
- 26 తులాల బంగారం, రూ.32వేల నగదు, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సత్యనారాయణ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

గద్వాల క్రైం: దేవాలయాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.32వేల నగదు, 26 తులాల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు గద్వాల డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అయిజకు చెందిన బుడగ జంగాల మారెప్ప, ఉరుకుందులు కలిసి ఫినాయిల్ వ్యాపారం చేస్తున్నారు. జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు దేవాలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ నెల 20న తాండ్రపాడు శివారులోని సత్యమాంబ దేవాలయంలో హుండీని పగులగొట్టి నగదును పంచుకునేందుకు రాయచూర్ రోడ్డు మార్గం వైపు వేళ్తున్నారు. వాహనాల తనిఖీ చేపట్టిన సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో గత నెల 28న గట్టు మండలం చాగదోణలో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సైతం హుండీలో నగదును అపహరించినట్లు వెల్లడించారు. ఈ కేసులో నిందితుల నుంచి రూ. 3,275 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇళ్లలో చోరీ..

కేటీదొడ్డి మండలం నందిన్నెకు చెందిన కుర్వ మహేష్ జూన్ 17న గట్టు మండలంలోని కుర్వ బుడ్డన్న ఇంట్లో చొరబడి 10తులాల బంగారం, రూ. 80వేల నగదు అపహరించారు. ఇదే నెల 20న గద్వాల పట్టణంలోని వీర ప్రతాప్ నివాసంలో 20.2 తులాల బంగారం, రూ.2.75లక్షల నగదును దోచుకెళ్లారు. ఈ నెల 18న మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామ శివారులోని ఓ ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. స్థానికులు గమనించి వారిని పట్టుకునేందుకు ప్రయత్నం చేయడంతో అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. సోమవారం తెల్లవారు జామున గద్వాల బస్టాండ్ ఆవరణంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా, తనిఖీలో ఉన్న సిబ్బంది వాకబ్ చేశారు. అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న క్రమంలో సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పలు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు వారు ఒప్పుకున్నారు. వారి నుంచి 26 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లలో చోరీలకు పాల్పడిన కేసులో మరి కొంత మంది నిందితులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని సైతం త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. చోరీలకు పాల్పడిన నిందితులను గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. బాధితులకు కోర్టు సమక్షంలో బంగారు ఆభరణాలు అందజేస్తామన్నారు. నిందితులపై గట్టు, గద్వాల, కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో జరుగుతున్న చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రజలెవరు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేసు ఛేదనలో సీఐ బీంకుమార్, ఎస్‌ఐలు శ్రీనివాస్, మల్లేష్, సీసీ కెమెరాల నిపుణుడు చంద్రయ్య, సిబ్బంది రంజిత్, రామకృష్ణ, ఇస్మాయిల్‌లకు రివార్డులు అందజేశారు. సమావేశంలో సీఐలు బీంకుమార్, టాటా బాబు, ఎస్‌ఐలు శ్రీనివాస్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



పర్సులో ఉన్న బంగారు ఆభరణాలు సుజాతకు అప్పగిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ప్రయాణికురాలు ఆటోలో మరిచిపోయిన పర్సును డ్రైవర్ రూరల్ పోలీసులకు అప్పగించాడు. ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఏనుగొండకు చెందిన సుజాత సోమవారం మధ్యాహ్నం ఏనుగొండలో ఆటో ఎక్కి షాషాబ్‌గుట్ట చౌరస్తా వద్ద దిగి వెళ్లిపోయింది. వెంట తెచ్చుకున్న పర్సు ఆటోలో మరిచిపోవడంతో డ్రైవర్ శాంతన్న రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు ప్రయాణికురాలి వివరాలు తెలుసుకుని పర్సులో ఉన్న రెండున్నర తులాల బంగారం ఆభరణాలు ఆమెకు అప్పగించారు.

శోభాయమానంగా రాధాకృష్ణ పుష్పయాగం



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

- 300 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన

నాగర్‌కర్నూల్: అమ్మవారిని కొలిచే వివిధ విధానాల్లో ఒకటైన కుంకుమార్చనకు ప్రత్యేకత ఉందని.. కుంకుమార్చన, నిత్య పారాయణం చేయడంతో ఆయుష్షు పెరిగి సౌభాగ్యం సిద్ధిస్తుందని జగద్గురు పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓంనగర్‌లో కొనసాగుతున్న విశ్వశాంతి మహాయాగంలో భాగంగా సోమవారం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించి.. విశిష్టతను వివరించారు. తెల్లవారుజామున, సాయంకాలం విశేషంగా పూజించాలన్నారు. అలాగే భక్తులు ఇంటి నుంచి తీసుకొచ్చిన పుష్పాలతో పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. వారికి వేద ఆశీర్వచనంతో పాటు ముత్యాల తలంబ్రాలు అందజేశారు.

బిజినేపల్లిలో వరుస చోరీలు

బిజినేపల్లి: బిజినేపల్లి అంటేనే దొంగలకు అడ్డా అన్నట్టుగా మారింది. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రంతో పాటు వట్టెంలో మూడు ఇళ్లలో వరుస దొంగతనాలు చోటుచేసుకున్నాయి. మండల కేంద్రానికి చెందిన వీరకార్ శివాజీ అనే వ్యక్తి చిట్టి డబ్బులు తీసుకొచ్చి ఇంట్లో భద్రపరిచాడు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి 7 గంటల ప్రాంతంలో వచ్చి చూసుకున్నాడు. ఇంటి కిటికీలు పగలగొట్టి దాదాపు రూ.4.5 లక్షలున్న పెట్టెను మాయం చేశారు. వట్టెంకి చెందిన శావుకుల శ్రీను, లక్ష్మీ, చందర్‌లకు చెందిన కుటుంబాలు జూలై 20న హైదరాబాద్ వెళ్లి తిరిగి ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. వీరి ఇళ్లలో తలుపులు తెరుచుకుని ఉండటంతో లోపలికి వెళ్లి చూశారు. శావుకుల శ్రీనుకు చెందిన 3 తులాల బంగారు, 25 తులాల వెండి, చందర్‌కు చెందిన రెండు తులాల బంగారం, లక్ష్మీవి రూ.50 వేల విలువ చేసే ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వీరంతా బిజినేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు క్లూస్ టీంతో తనిఖీలు చేపట్టారు. అనంతరం వరుస దొంగతనాలకు గురైన కుటుంబాలు బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

చోరీలు షరా మాములే..

బిజినేపల్లి మండలంలో కొద్ది నెలలుగా దొంగల బెడద తీవ్రంగా ఉంది. నిత్యం బోరు బావి మోటార్లు, ప్రతి గురువారం మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు, వారంలో ఒక్కసారి ఇళ్లలో చోరీలు చోటుచేసుకోవడం సాధారణమైంది. కానీ పోలీస్ అధికారులు ఫిర్యాదులు తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారే కానీ.. క్షేత్రస్థాయిలో విచారణ చేయడం లేదని, ఉన్నతాధికారులు కూడా చోరీలను పట్టించుకోకుండా సెటిల్‌మెంట్ల మామూళ్ల మత్తులో జోగుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.



బిజినేపల్లిలో ధ్వంసమైన కిటికీ